సాక్షి జోగుళాంబ గద్వాల

మంగళవారం, 26, డిసెంబర్, 2023



కేంద్ర పథకాలపై అవగాహన

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని రాహుల్ కశ్యప్ అన్నారు.

వివరాలు 10లో ▸



నిత్యం.. రక్తసిక్తం

167వ నంబర్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.0 /16.2

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లటి గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

ఇదేం చలి.. బాబోయ్

- జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు



మహబూబ్‌నగర్‌లో లైట్ల వెలుతురులో వెళ్తున్న బస్సు

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఒకదశలో 10 డిగ్రీలకు పడిపోవడంతో.. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. పొగమంచు కప్పేస్తుండటంతో రహదారులు స్పష్టంగా కనిపించడం లేదు. ఫలితంగా వాహనదారులు లైట్లు వేసుకుని ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా చల్లని గాలులతో చలి తీవ్రత పెరుగుతోంది. గత నాలుగు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతున్నాయి. దీంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా చలి గజగజ వణికిస్తోంది. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ప్రజలు చిన్నా.. పెద్ద అనే తేడా లేకుండా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం పొగ మంచు కమ్మేస్తుండటం .. 9 గంటలు అయిన చలి తగ్గకపోవడంతో వృద్ధులు, చిన్నపిల్లలు విలవిలాడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లోనే ఈ నెల 23న అతి తక్కువగా మహబూబ్‌నగర్ పరిశోధన స్థానంలో 16.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నా.. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

పొంచి ఉన్న వ్యాధులు..

చలి తీవ్రతకు మనిషి శరీరంలోని రక్తనాళాలు ముడుచుకుపోతాయి. దీంతో రక్తప్రసరణ సాఫీగా సాగదు. ఇది గుండె, మెదడుపై ప్రభావం చూపి ఆయాసం, గుండె నొప్పి, బ్రెయిన్ స్ట్రోక్, ఫిట్స్ ఆకస్మికంగా కుప్పకూలడం వంటివి తలెత్తే ప్రమాదం ఉంది. అధిక చలి వల్ల ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు రావడానికి అవకాశం ఉంటుంది.

జిల్లాలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ట	కనిష్ట
20-12-23	32.4	18.7
21-12-23	31.1	17.9
22-12-23	30.1	14.4
23-12-23	29.2	11.8
24-12-23	31.2	17.3
25-12-23	30.0	16.2

జాగ్రత్తలు పాటించాలి..

జలుబు, ఆయాసంతో కూడిన శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు జనరల్ ఆస్పత్రికి అధికంగా వస్తున్నారు. వెచ్చటి దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లినప్పుడు మాస్క్ తప్పనిసరిగా పెట్టుకోవాలి. వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలి. విటమిన్–సీ ఉన్న పండ్లు దానిమ్మ, రేగి, కివి వంటివి తినాలి.చలిలో వెళ్తే దీర్ఘకాలిక వ్యాధులు, మధుమేహం ఇతర సమస్యలు ఉన్నవారి నరాలు దెబ్బతింటాయి.

– జీవన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ మహబూబ్‌నగర్

పత్తి రైతు గోస..

- వర్షాభావ పరిస్థితులతో గణనీయంగా తగ్గిన దిగుబడి
- ఈసారి రూ.7 వేలకే పరిమితమైన ధైనం
- బహిరంగంగా మద్దతు ధర కన్నా తక్కువకే కొంటున్న దళారులు
- గిట్టుబాటు కావడం లేదని రైతుల ఆందోళన
- గతేడాది క్వింటాల్‌కు రూ.9 వేల వరకు పలికిన ధర



సాక్షి, నాగర్‌కర్నూల్: పత్తికి ధర లేక రైతులు గోస పడుతున్నారు. గతేడాది ఒక దశలో క్వింటాల్‌కు రూ.9 వేల వరకు పలికిన ధర ఈ సీజన్‌లో మాత్రం భారీగా తగ్గుముఖం పట్టింది. బహిరంగ మార్కెట్‌లో దళారులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020 కన్నా తక్కువకే పత్తిని కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈసారి వర్షాలు సరిగా లేక పంట దిగుబడి గణనీయంగా తగ్గిందని, ఈ పరిస్థితుల్లో అరకొరగా చేతికొచ్చిన పంటకు సరైన ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని పత్తిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో పంటకు ధర పెరుగుతుందన్న ఆశతో కొంతమంది పత్తిని నిల్వ చేసుకుంటుండగా.. చాలామంది పెట్టుబడులకు చేసిన అప్పులు తీర్చుకునేందుకు ప్రైవేట్ వ్యక్తులకు, సీసీఐ కేంద్రాల వద్ద అమ్ముకుంటున్నారు.



నవాబ్‌పేట మండలం పోమాల్‌లో పత్తి కొనుగోలు చేసి డీసీఎంలో తరలిస్తున్న ప్రైవేట్ వాపారులు

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో రైతులు అధికంగా పత్తిపంటను సాగుచేశారు. ఈ సీజన్‌లో నాగర్‌కర్నూల్‌లో అత్యధికంగా 2,35,961 ఎకరాల్లో పత్తి సాగుచేయగా.. నారాయణపేటలో 2,03,015 ఎకరాల్లో, జోగుళాంబ గద్వాలలో 1,46,128 ఎకరాల్లో, మహబూబ్‌నగర్‌లో 85,618 ఎకరాల్లో, వనపర్తి జిల్లాలో తక్కువగా 8,530 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. అయితే వనపర్తి జిల్లాలో అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు మహబూబ్‌నగర్ జిల్లాలోని కేంద్రాలకు పత్తిని తరలించాల్సి వస్తోంది. ఈసారి వర్షాభావ పరిస్థితులతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిందని, తెగుళ్ల ప్రభావం ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. దీనికితోడు ధర రూ.7 వేలకే పరిమితం కావడం, ప్రైవేట్‌లో క్వింటాల్‌కు రూ.6,500–6,800 వరకే కొనుగోలు చేస్తుండటంతో తమకు గిట్టుబాటు కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. పత్తిధర క్వింటాల్‌కు కనీసం రూ.8వేలు ఉంటేనే పెట్టుబడి ఖర్చులు వస్తాయని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగైన పత్తి పంట వివరాలు.. (ఎకరాల్లో)	
నాగర్‌కర్నూల్	2,35,961
నారాయణపేట	2,03,015
గద్వాల	1,46,128
మహబూబ్‌నగర్	85,618
వనపర్తి	8,530

తక్కువ ధరకే అమ్మా..



నాకున్న నాలుగు ఎకరాల్లో పత్తిపంట సాగుచేశాను. ఈసారి వర్షాలు సరిగా లేక, తెగుళ్లు సోకి పంట దిగుబడి బాగా తగ్గింది. ఇటీవల క్వింటాలుకు రూ.6,500కే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నా. గతేడాది కన్నా ఈ సీజన్‌లో పత్తి ధర తక్కువగా ఉండటంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు.

– వెంకట్‌రెడ్డి, రైతు, శిర్సనగండ్ల, చారకొండ మండలం, నాగర్‌కర్నూల్

ఇంట్లోనే నిల్వ ఉంచా..



8 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి అయింది. పంట చేతికి వచ్చిన సమయంలో మార్కెట్‌లో మద్దతు ధర లేక తీసిన పత్తిని ఇంట్లోనే నిల్వ చేశాను. గతేడాది కూడా ఇలాగే నిల్వ చేసినా మొదట్లో పత్తికి మద్దతు ధర రాలేదు. తక్కువకే అమ్ముకోవడంతో ఎకరాకు రూ.15 వేల చొప్పున నష్టం వచ్చింది. ఈ ఏడాది పత్తికి మార్కెట్‌లో ధర లేక ప్రస్తుతం అమ్మడం లేదు.

– మల్లారెడ్డి, రైతు, అప్పంపల్లి, నారాయణపేట జిల్లా

పెట్టుబడి కూడా రాలే..



వానాకాలం సీజన్‌లో ఎకరా పొలంలో కమర్షియల్ పత్తిని సాగు చేశాను. ఇందుకోసం ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి ఖర్చు అయ్యింది. అయితే వర్షాలు లేక, కేవలం రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఇక్కడ ధర లేక వచ్చిన పంటను పక్క రాష్ట్రంలోని రాయిచూర్ మార్కెట్లో అమ్ముకోవాల్సి వచ్చింది. పెట్టుబడులు కూడా రాక అప్పులే మిగిలాయి.

– వెంకటేష్, రైతు, గట్టు, గద్వాల

కనీసం రూ.8 వేలు ఉండాలి



పెరిగిన పెట్టుబడుల కారణంగా మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి కనీసం రూ.8 వేలు ఉండాలి. ప్రభుత్వం కొనుగోలు చేసే పత్తి నాణ్యతగా ఉంటేనే రూ.7,020 చెల్లిస్తుంది. ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్తే క్వింటాకు రూ.5– 6 వేలకే కొనుగోలు చేయడంతో రూ.వెయ్యి నష్టపోతున్నాం. గత నెల రోజుల నుంచి పత్తికి మార్కెట్‌లో స్థిరంగా ధరలు లేకపోవడంతో చేసేదేమీ లేక తక్కువకే అమ్ముకుంటున్నాం.

– మాసప్ప, రైతు, మరికల్, నారాయణపేట జిల్లా

ప్రైవేట్‌లో విక్రయించొద్దు

సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల కోసం కేంద్రాలను ఏర్పాటుచేశాం. ప్రభుత్వ కనీస మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు రూ.7,020 చొప్పున చెల్లింపులు చేస్తున్నాం. రైతులు తక్కువ ధరకు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించకుండా సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– బాలామణి, జిల్లా మార్కెటింగ్ అధికారి, నాగర్‌కర్నూల్

రాయచూర్‌కు తరలింపు..

ఈసారి నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి తక్కువగా వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సీసీఐ ఆధ్వర్యంలో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లకు గద్వాలలోని బాలాజీ జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లు, అలంపూర్ చౌరస్తాలోని వరసిద్ధి వినాయక జిన్నింగ్ మిల్లులో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రూ.7,020కి మించి రాయిచూరు మార్కెట్లో లభిస్తుండటంతో రైతులు అక్కడికే తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీంతో గద్వాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. అలంపూర్ చౌరస్తాలోని మిల్లులో ఇప్పటి వరకు 157 మంది రైతుల నుంచి మొత్తం 384.65 మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే అధికారులు కొనుగోలు చేశారు. అలాగే నారాయణపేట జిల్లాలో ఇప్పటి వరకు 2,658 మంది రైతుల నుంచి 48,599.95 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు.

క్రీస్తుతత్వం.. భక్తజన తన్మయత్వం



అయిజ ఎంబీ చర్చిలో వేడుకలకు హాజరైన క్రైస్తవులు

- జిల్లాలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- క్రీస్తు జననంపై సందేశమిచ్చిన పాస్టర్లు

గద్వాల: ప్రపంచానికి శాంతి సందేశం అందించిన యేసుక్రీస్తు ఆగమనవేళ.. జిల్లా అంతటా చర్చిలు ప్రార్థనలతో ప్రతిధ్వనించాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం అర్ధరాత్రికి ముందే చర్చిలన్నీ విద్యుద్దీపాలంకరణ నడుమ సందడిగా మారాయి. బాలయేసును స్వాగతించడానికి చిన్నా, పెద్ద అంతా ఉత్సాహంగా ఎదురుచూశారు. ప్రత్యేక ప్రార్థనల నడుమ ఆ ఘడియ రానే వచ్చింది. 'పరిశుద్ధాత్ముని కృప వల్ల అంతా శుభమే జరగాలంటూ' మత పెద్దలు ఆకాంక్షించగా, భక్తులంతా జీసస్‌కు జేజేలు పలికారు. పొద్దు పోయేదాక క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా పరిధిలోని ఆయా చర్చిలలో వేడుకల సందర్భంగా చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. చర్చి పాస్టర్లు, మత పెద్దలు, ఇతర రాజకీయ నాయకులు వేరువేరుగా జిల్లా కేంద్రంతోపాటు మండలాల పరిధిలోని పలు చర్చిలలో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయా చర్చిలలోని పాస్టర్లు సందేశాన్ని ఇచ్చారు. ప్రేమ, కరుణలతో ప్రపంచాన్ని జయించవచ్చని తెలిపి సర్వ మానవాళికి శాంతి సందేశాన్ని వినిపించిన యేసు ప్రభువును ప్రతి ఒక్కరూ అనుసరించాలని గుర్తు చేశారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం..

తనకు హాని చేసిన వారిని కూడా ప్రేమించమని చెప్పిన యేసుక్రీస్తు బోధనలు పాటించినట్లయితే సమాజంలో శాంతి నెలకొంటుందని, నియోజకవర్గంలోని క్రైస్తవుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంబీ మిస్పా చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు ప్రజలందరిని రక్షించడానికి ఈ లోకానికి వచ్చాడని, ప్రజలందరు వారి హృదయంలో యేసును కలిగి శాంతితో జీవించాలని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలే కాక రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, ఆ యేసు ప్రభువు అందరిని దీవించాలని ప్రార్థించారు.

వేడుకల్లో జెడ్పీచైర్‌పర్సన్..

జిల్లా కేంద్రంలోని పలు చర్చిలలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. క్రిస్మస్ అంతరార్థం సేవాగుణమనే లక్ష్యాన్ని ప్రతి ఒక్కరు ఆచరించాలని సూచించారు.



మల్దకల్ మండలం ఎల్కూరులో క్రిస్‌మస్ సందర్భంగా చిన్నారుల నృత్యాలు



జిల్లా కేంద్రంలో ఎంబీ మిస్పా చర్చిలో గీతాలు ఆలపిస్తున్న భక్తులు



గద్వాల చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

సేవాభావం అలవర్చుకోవాలి



గద్వాలలోని అంధుల పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న రిటైర్డ్ హెడ్మాస్టర్ కమలమ్మ

గద్వాల అర్బన్: యువత సేవాభావం అలవర్చుకోవాలని రిటైర్డ్ హెడ్మాస్టర్ కమలమ్మ, ఉపాధ్యాయుడు ఆర్ మోహన్ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని అంధుల పాఠశాలలో గద్వాల మండలం కాకులావరం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. యువజన సంఘం తరఫున వాషింగ్ మిషన్ వితరణ చేశారు.

రథోత్సవానికి వేళాయె..

- నేడు మల్దకల్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం
- సర్వాంగ సుందరంగా ఆలయం, తేరు ముస్తాబు
- 250మంది పోలీసులతో బందోబస్తు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం రాత్రి రథోత్సవం నిర్వహించనుండగా.. వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. దీంతో ఆలయాన్ని, రథాన్ని విద్యుద్దీపాలు, పూలతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలతో పాటు మామిడి తోరణాలు, పూలతో ఆలయాన్ని అలంకరించారు. ఆలయ ముఖద్వారం నుంచి గర్భాలయం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలు, వెంకటేశ్వరస్వామి వారి నామాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



అలంకరణలో స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

జాతర సందర్భంగా ఇప్పటికే వ్యాపారస్తులు తమ వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకున్నారు.



విద్యుద్దీపాలు, పూల అలంకరణలో ఆదిశిలా క్షేత్రం

సీసీ కెమెరాలతో పోలీసుల నిఘా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం, జాతర నేపథ్యంలో 250మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఏఎస్పీ రవి ఆధ్వర్యంలో ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 20మంది ఎస్‌ఐలతో పాటు ఏఎస్‌లు, హెడ్‌కానిస్టేబుళ్లు, మిగతా పోలీసు సిబ్బందిని జాతరలో బందోబస్తుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. అదే విధంగా జాతర మొత్తం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏఎస్పీ ప్రత్యేక పూజలు..

ఆలయంలో ఏఎస్పీ రవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు శేషవస్త్రంతో సత్కరించి మెమోంటో అందజేశారు.

ఐక్యతే ధర్మ పరిరక్షణకు మార్గం



మాట్లాడుతున్న గుమ్మల్ల సత్యంజీ

ఉండవెల్లి: ప్రతి హిందువు ఏకమై ఐక్యంగా ఉండాలని.. అప్పుడే ధర్మ పరిరక్షణకు మార్గం సుగమం అవుతుందని విశ్వహిందు పరిషత్ అఖిల భారత సహాయ కార్యదర్శి గుమ్మల్ల సత్యంజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అయోధ్య రామమందిరంపై పలు అంశాలను, అక్షతల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలంపూర్, ఉండవెల్లి మండలాలకు చెందిన ప్రజలు తరలిరాగా.. ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో హిందువుగా ఉన్న వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చి.. అందరినీ కలుపుకొని పోయి ఐక్యం కావాలని, దేవాలయాలను సందర్శించి వాటి ప్రత్యేకతలను తెలుసుకోవాలన్నారు. పురాతన ఆలయాలను పడగొట్టకుండా వాటిని రక్షించే దిశలో ముందడుగు వేయాలని సూచించారు. విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో మండలాల కమిటీని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసి ప్రధాన కార్యదర్శి ఆనంద్ శర్మ, విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహయ్య, లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

భూత్పూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన భూత్పూర్ మున్సిపాలిటీలోని సిద్దాయిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లా మరుపల్లి మండలం వీర్లపల్లికి చెందిన ఎన్.రాములు (35) తన భార్య లలితతో కలిసి ఎనిమిదేళ్లుగా భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌కు చెందిన రమేష్ వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నాడు. పంటల సాగు నిమిత్తం సిద్దాయిపల్లి రాందాస్ చెరువులో విద్యుత్ మోటార్ బిగించి నీటిని వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం పొలానికి నీరు పెట్టడానికి రాములు వెళ్లగా.. మోటార్ పనిచేయలేదు. దీంతో చెరువులో నుంచి మోటార్‌ను బయటికి తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

భూత్పూర్: భూత్పూర్ మండలంలోని కర్వెనకు చెందిన హన్మంత్‌రెడ్డి (20) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. ఇటీవల హన్మంత్‌రెడ్డి బైక్‌పై వెళ్తుండగా.. కర్వెన సమీపంలో బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. అతడి అవయవాలను తల్లిదండ్రులు దానం చేసినట్లు వివరించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్ఐ వెల్లడించారు.

పురుగు మందు తాగి మహిళ బలవన్మరణం


బుజ్జి (ఫైల్)


చారకొండ: పురుగు మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చారకొండ మండలం సారంబండతండాలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య వివరాల మేరకు.. సారంబండ తండాకు చెందిన వడ్త్యావత్ బుజ్జి (48) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో ఆరోగ్యం మరింత క్షీణించడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత..


రజియా (ఫైల్)

కల్వకుర్తి టౌన్: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత బలన్మరణానికి పాల్పడిన ఘటన కల్వకుర్తి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్, కుటుంబ సభ్యులు వివరాల మేరకు.. పట్టణంలోని హనుమాన్ నగర్‌కు వెళ్లే దారిలో నివాసముండే ఫిరోజ్‌కు హైదరాబాద్‌కు చెందిన రజియా (30)తో మూడేళ్ల కిందట వివాహమైంది. అయితే అదనపు కట్నం కోసం రజియాపై అత్తింటి వేధింపులు ఎక్కువయ్యాయి. పలుమార్లు పెద్దలు నచ్చజెప్పినా వారి తీరు మారలేదు. దీంతో మనస్తాపానికి గురైన రజియా.. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటికి నిప్పంటించుకొంది. గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పివేసి, పోలీసులతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆమెను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. రజియా ఆత్మహత్యకు భర్త ఫిరోజ్‌తో పాటు అతడి తల్లిదండ్రుల వేధింపులే కారణమని మృతురాలి తల్లి బీబీ ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మృతురాలికి మూడేళ్ల బాబుతో పాటు ఏడాది వయసు గల మరో బాబు ఉన్నారు.

చెక్‌డ్యాంలో యువకుడి గల్లంతు


వెంకటయ్య

కోస్గి: చెక్‌డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతైన ఘటన కోస్గి మండలం ముశ్రీఫా గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ముశ్రీఫాకు చెందిన బుడగజంగం వెంకటయ్య (32), శ్రీనివాస్ సోమవారం గ్రామ సమీపంలోని చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లారు. వాగు లోతు గమనించకుండా నీటిలోకి దిగిన వెంకటయ్యకు ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. అతడి కోసం శ్రీనివాస్ గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. విషయాన్ని గ్రామస్తులతో పాటు పోలీసులకు తెలియజేయడంతో చెక్‌డ్యాం వద్దకు చేరుకొని రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు.

మార్మోగిన శరణుఘోష



అయ్యప్పకొండపై నిర్వహించిన పడిపూజలో పాల్గొన్న భక్తులు.. పడిపూజ నిర్వహిస్తున్న వెంకటేశ్వర చంద్రమౌళి శర్మ

- పాలమూరు అయ్యప్పకొండపై వైభవంగా మహాపడిపూజ
- జిల్లాకేంద్రంలో ఆకట్టుకున్న రథం, పల్లకీ శోభాయాత్ర
- రక్తదానం చేసిన అయ్యప్పమాలధారులు


ఊరేగింపులో హరిహర సుతుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రం పద్మావతీకాలనీలోగల అయ్యప్పకొండపై మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం తూర్పు కమాన్ రామాలయం నుంచి ప్రారంభమైన కలశం, పల్లకీ ఊరేగింపు శోభాయాత్ర గడియారం చౌరస్తా, క్లాక్‌టవర్, అశోక్ టాకీస్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, న్యూటౌన్, మెట్టుగడ్డ, పద్మావతి కాలనీ రహదారుల మీదుగా ఆలయం వరకు కొనసాగింది. పట్టణంలో అయ్యప్ప పల్లకీతోపాటు రథం, పూర్ణకలశం, స్వామివారి ఆభరణాలను స్వాములు ఊరేగింపుగా ఆలయానికి తెచ్చారు. శోభాయాత్రలో ఆద్యంతం అయ్యప్ప మాలధారులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అయ్యప్ప నామస్మరణతో పట్టణం మార్మోగింది. లయబద్ధంగా సాగిన శరణుఘోష భక్తిని ఇనుమడింపజేసింది. ఊరేగింపులో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, డీకే అరుణ పాల్గొని అయ్యప్పను దర్శించుకున్నారు.

స్వామివారికి విశేష పూజలు

అయ్యప్ప ఆలయంలో స్వామివారికి అష్టాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఉదయం గణపతి, నవగ్రహ హోమాలు, నిత్యాభిషేకం, సహస్రనామార్చనలు చేశారు. రాత్రికి తిరుపతికి చెందిన వెంకటేశ్వర చంద్రమౌళి శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి చందనం, పంచామృతాలతో ఘనంగా అభిషేకాలు, ఏకశిల దివ్య పదు నెట్టాంబడి పూజ, మహామంగళహారతి నిర్వహించారు. మహా పడిపూజలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు సీఆర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి ముత్యంస్వామి, పంబరాజు, మాల్యాద్రిరెడ్డి, హన్మేష్ తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపులో కర్రె విన్యాస ప్రదర్శన

రక్తదానం చేస్తున్న అయ్యప్ప మాలధారులు



అయ్యప్పకొండపై రక్తదాన శిబిరం

అయ్యప్పకొండ వద్ద పడిపూజ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని అయ్యప్పసేవా సమాజం అధ్యక్షుడు భగవంతురావు ప్రారంభించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ మాట్లాడుతూ శిబిరంలో 238 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ కోశాధికారి జగపతిరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం


పుష్కరిణిలో హంస వాహనంపై విహరిస్తున్న ఆదిశిలావాసుడు

మల్దకల్: జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను శేషవాహనంపై భాజాభజంత్రీలు, మేళతాళాల మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో స్వామివారు విహరించారు. అనంతరం స్వామివారు శేషవాహనంపై దశమికట్ట మీదుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి తెప్పోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

కనులపండువగా అంజన్న ప్రభోత్సవం

మక్తల్: మక్తల్ పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో పవమాన హోమం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన స్వామివారి ప్రభోత్సవంలో వందలాది భక్తులు పాల్గొన్నారు. ఆలయం నుంచి బాలాంజనేయస్వామి ఆలయం వరకు ప్రభోత్సవం కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భీమాచారి, ఈఓ శ్యాంసుందర్‌చారి, పూజారి ప్రాణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పవమాన హోమం నిర్వహిస్తున్న పండితులు


పడమటి అంజన్న ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

బైక్‌పై వెళ్తున్న తండ్రీకొడుకును ఢీకొట్టిన కారు

- తండ్రి మృతి, కుమారుడికి తీవ్రగాయాలు


సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

దామరగిద్ద: తోట నారు తెచ్చేందుకు బైక్‌పై వెళ్తున్న తండ్రీకొడుకును కారు ఢీకొట్టిన ప్రమాదంలో తండ్రి మృతి చెందగా.. కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాదకర ఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం పిడెంపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పిడెంపల్లికి చెందిన సుదర్శన్‌రెడ్డి (43) తోటనారు తెచ్చేందుకుగాను తన కుమారుడు సాయి యశ్వంత్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. స్టేజీ వద్ద ప్రధాన రహదారిపై వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో సుదర్శన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా. అతడి కుమారుడు సాయి యశ్వంత్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని సాయి యశ్వంత్‌రెడ్డిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు చంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఎండీ ఖాజాపాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

లారీ ఢీకొని మరో వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై మృతి చెందాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ నవీద్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని మేకలబండకు చెందిన సయ్యద్ ఖాసీం (45) వన్‌టౌన్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య షాహెదాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

మల్దకల్‌లో యువకుడు..

మల్దకల్: జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. అయిజకు చెందిన శివరాము (23)తో పాటు మరో నలుగురు యువకులు కాలినడకన మల్దకల్ ఆదిశిలా క్షేత్రానికి వెళ్తుండగా.. వెనుకవైపు నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన చంద్రశేఖర్ అనే వ్యక్తి వారిని ఢీకొట్టాడు. ప్రమాదంలో శివరాము అక్కడికక్కడే మృతి చెందగా.. తిరుమల్, నాగరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

మృతదేహాలు అప్పగింత

మక్తల్: మక్తల్ మండలం జక్లేర్ సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయ్యింది. కర్ణాటక రాష్ట్రం సైదాపూర్‌కు చెందిన మౌలాలి, అతడి భార్య రెహమాన్‌బేగం, సమీప బంధువు ఖలీల్, ఒడిశా రాష్ట్రానికి చెందిన భవిత సమల్, ఆమె కూతురు అవిస్మిత మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని, గట్టు, తుమ్మిళ్ల లిఫ్టు ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి పాలమూరులో సాగు, తాగునీరు అందించడానికి ప్రధానంగా జూరాల ప్రాజెక్టు ద్వారా నీరు తీసుకోవడానికి అవకాశం ఉన్నా డిజైన్లు మార్చి పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టి.. కల్వకుర్తి ప్రాంతానికి పరిమితం చేసి మక్తల్, నారాయణపేట, కొడంగల్, మహబూబ్‌నగర్, జడ్చర్ల ప్రాంతాలకు జూరాల పైభాగం నుంచి కొత్తగా ప్రాజెక్టు ఏర్పాటు చేసి సాగునీరు అందించే విధంగా దృష్టిసారించాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన తర్వాత కండిషన్లు పెడుతూ వెనక్కి తగ్గడం సరికాదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి జరిగిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ స్థానాలు అధికంగా గెలిపించాలన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, ప్రతిచోట ఇదే చర్చ జరుగుతుందన్నారు. కేంద్ర పథకాల ద్వారా ప్రజలు ఎంతో మంది లబ్ధి పొందుతున్నారని, విశ్వకర్మ పథకం ద్వారా 18 రకాల కుల వృత్తులకు రూ.3 లక్షల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని, విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కోశాధికారి శాంతికుమార్ మాట్లాడుతూ వాజ్‌పేయి జయంతిని 2014 నుంచి సుపారిపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, నాయకులు పద్మజారెడ్డి, బాలత్రిపురసుందరి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగు.. లాభాలు బాగు


మినుము పంట


పెసర పంట

- తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు
- భూసారం వృద్ధి
- పంట మార్పిడి విధానం పాటించాలి: ఏడీఏ సక్రియనాయక్

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగు చేయాలంటే అన్నదాతలు అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. వరిసాగుకు నీటి వినియోగం ఎక్కువ కావడం, తెగుళ్ల బెడద, పండిన పంటను విక్రయించేందుకు ఇబ్బందులు నెలకొంటున్నాయి. ప్రధానంగా నీటి లభ్యతలో అన్నదాతలు కష్టాలు పడాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అనేక మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వరిపంట స్థానంలో అపరాలు (పప్పుదినుసులు) సాగు చేయడం లాభసాటిగా ఉంటోంది. ఒక ఎకరం వరిసాగుకు కావాల్సిన నీటితో 3నుంచి 4 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియనాయక్ సూచిస్తున్నారు. సాగునీళ్లు, విద్యుత్ ఆదా కావడంతో పాటు భూసారం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటున్నారు. అపరాలల్లో తక్కువ కాలపరిమితితో పెసర, మినుము రకాలు సాగు చేసుకోవచ్చని, ఈ పంట త్వరగా పెరుగుతుందని చెబుతున్నారు.

పెసర రకాలు: డబ్ల్యూజీఎల్-42, 37, ఎంజీజీ 295, 347, 348, 351 ఈ రకాలు దాదాపు 70నుంచి 75 రోజులకు కోతకు వస్తాయి. ఎకరాకు సుమారు 5 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.

మినుముల రకాలు: డబ్ల్యూబీజీ-26, ఎల్‌బీజీ-20, 623, 752, 787, పీయూ-31 రకాలు దాదాపు 80నుంచి 85 రోజుల్లో కోతకు వస్తాయి. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.

విత్తన మోతాదు: నాగటి సాలల్లో లేదా సీడ్ డ్రిల్‌తో వేస్తే ఎకరానికి 8 కిలోల విత్తనాలు అవసరం. వెదజల్లే పద్ధతిలో అయితే 12 నుంచి 14 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. సాలుకు సాలు మధ్య 30 సెం.మీ., మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేటట్టు చూసుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనాలకు 30 గ్రాముల కార్బోసల్ఫాన్ మందు పట్టించి విత్తనశుద్ధి చేసుకోవాలి.

ఎరువులు: దుక్కిలో 40 కిలోల డీఏపీ ఎకరానికి వేసుకోవాలి.

కలుపు నివారణ: విత్తిన 48 గంటల్లో పెండిమిథాలిన్ అనే కలుపు మందును ఎకరానికి 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

నీటి యాజమాన్యం: విత్తిన 20 రోజుల వరకు, 40 రోజుల నుంచి పూత, కోత దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. సక్రమ నీటి యాజమాన్యానికిగాను పంటను చిన్నచిన్న మడులుగా విభజించి ఒకటి తర్వాత ఒకటి పారించడం మంచిది.

సస్యరక్షణ: కాండపు ఈగ, తామర పురుగుల నివారణకు ఎసీఫేట్ 350 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. తెల్లదోమ నివారణకు ట్రయజోఫాస్ 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు, మారుకా, మచ్చల పురుగు, లద్దె పురుగు నివారణకు స్పైనోశాడ్ 75 గ్రాములు, ఇండాక్సికార్బ్ 200 మీ.లీ., నువాలురాన్ 300 మి.లీ. ఫ్లూబెంజురాన్ 30 మి.లీ., ఎమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

బూడిద తెగులు: పంట విత్తిన 40 రోజుల తర్వాత గాలిలో తేమ ఎక్కువగా ఉంటే ముదురు ఆకులపై బూడిద రంగులో చిన్నచిన్న మచ్చలుగా కనబడి క్రమేనా కొమ్మలు, కాయలకు వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు: అజాక్సి స్ట్రోబిన్ 200 మి.లీ., ట్రైడిమార్ఫ్ 200 మి.లీ., హెక్సాకొనజోల్ 400 మి.లీ., మైకోబు టానిల్ 250 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

విద్యారంగ సంక్షేమమే లక్ష్యం

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య


మాట్లాడుతున్న కె.జంగయ్య

కందనూలు: రాష్ట్రంలో విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ నిత్యం పని చేస్తోందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య తెలిపారు. సోమవారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ అధ్యక్షతన జిల్లాకేంద్రంలో జరిగిన జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని.. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి పోరాటాల ఫలితంగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ కోర్టు వివాదాలతో నిలిచిపోయిందని చెప్పారు. నాటి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని.. కొత్త ప్రభుత్వం వీటన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉన్నతి', 'తొలిమెట్టు' కార్యక్రమాలు ఉపాధ్యాయులపై వత్తిడి పెంచుతున్నది వాస్తవమేనని.. విద్యాశాఖ అధికారులు, విద్యావేత్తలతో చర్చించి ప్రశాంత వాతావరణంలో బోధనాభ్యసన ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్‌శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.చిన్నయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.ఉమాదేవి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.వెంకటేశ్వర్లు, పూర్వ అధ్యక్షుడు పి.వహీద్‌ఖాన్, జిల్లా కార్యదర్శులు పి.రామేశ్వరయ్య, కె.శంకర్, ఆర్.లక్ష్మణ్, ఆర్.లలితాబాయి, ఎం.శ్రీనివాస్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎస్.నెహ్రూప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణలో పక్షపాతం

- న్యాయం చేయాలని బాధితుల ధర్నా


ధర్నా చేస్తున్న ఇళ్ల యజమానులు

జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలో చేపడుతున్న 167వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పక్షపాతం చూపుతున్నారని రోడ్డుకు ఓవైపు ఉన్న నివాసగృహాలు, దుకాణాల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో చెప్పిన విధంగా కాకుండా తమ ఇళ్ల వైపు ఎక్కువ స్థలాన్ని సేకరించి, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు. రహదారి మధ్య నుంచి అటు, ఇటు సమానంగా స్థలాన్ని సేకరించి పనులు చేపట్టాల్సి ఉండగా.. ఓవైపున తక్కువగా స్థలాన్ని సేకరించడం తగదన్నారు. స్థల సేకరణపై స్పష్టత లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ ఇతర అధికారులు స్పందించి.. తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పరమేశ్వర్, రామనాథం, సంతోష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో మంగళవారం జరగనుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో అభివృద్ధి పనులతో పాటు మరిన్ని అంశాలపై పాలకమండలి చర్చించనుంది.

సర్వదర్శన టోకెన్ల జారీ పూర్తి:

ఈ నెల 23 నుంచి 2024, జనవరి 1వ తేదీ వరకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించిన సర్వ దర్శన టోకెన్ల జారీని సోమవారం టీటీడీ పూర్తి చేసింది. తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎంఆర్ పల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో 90 కౌంటర్లలో 10 రోజులకు గాను నాలుగు లక్షలకుపైగా సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను భక్తులకు అందించారు. తదుపరి సర్వదర్శనం టోకెన్లను జనవరి 2వ తేదీ నుంచి ఇవ్వనున్నారు.

నేడు పౌర్ణమి గరుడసేవ రద్దు

తిరుమలలో మంగళవారం నిర్వహించాల్సిన పౌర్ణమి గరుడ సేవను టీటీడీ రద్దు చేసింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. అయితే శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు జరుగుతున్న కారణంగా మంగళవారం పౌర్ణమి గరుడసేవ రద్దు చేసింది.

పులివెందులలో సీఎం క్రిస్మస్ వేడుకలు

కేక్ కట్‌చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ● ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు



వైఎస్సార్ జిల్లా పులివెందుల సీఎస్‌ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో సీఎం మాతృమూర్తి వైఎస్ విజయమ్మ



సీఎం జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న వైఎస్ విజయమ్మ

పులివెందుల: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లాలో మూడ్రోజుల పర్యటనలో భాగంగా మూడో రోజైన సోమవారం ఉదయం ముఖ్యమంత్రి ఇడుపులపాయ ఎస్టేట్ నుంచి హెలికాప్టర్ ద్వారా భాకరాపురం హెలిప్యాడ్, అక్కడ నుంచి రోడ్డు మార్గంద్వారా పులివెందుల పట్టణానికి చేరుకున్నారు. ఉ.9.30 గంటలకు సీఎస్‌ఐ చర్చి ప్రాంగణానికి చేరుకుని అక్కడ హాజరైన వారిని ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన బంధువర్గానికి, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్.. ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ.. ఏటా క్రిస్మస్ రోజున తన సొంత గడ్డపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. అందరి అభిమానం, ఆశీస్సులు, దేవుని చల్లని దీవెనలు తనకు ఎల్లవేళ లా ఉండాలని కోరుకుంటున్నానని ఆయన ప్రార్థించారు. రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో తరిస్తున్నానని.. ఎప్పటికీ మీ హృదయాల్లో ప్రియమైన నాయకుడిగా సుస్థిర స్థానాన్ని పొందుతానన్నారు. అనంతరం సీఎం జగన్ తన కుటుంబసభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. 2024 నూతన సంవత్సర చర్చి కేలండర్‌ను ఆవిష్కరించారు. క్రిస్మస్ వేడుకల్లో సీఎం జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, కుటుంబసభ్యులు వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆత్మీయులు, మిత్రులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలి

సీఎం వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలని కోరుకుంటూ క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అని సోమవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టులకు నోటిఫికేషన్

● 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: ఏపీ దేవదాయ శాఖలో 70 ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలైంది. 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), మరో 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టులు కాంట్రాక్టు విధానంలో భర్తీకి దేవదాయ శాఖ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 30 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నియామక ప్రక్రియ మొత్తాన్ని ప్రభుత్వం ప్రముఖ సంస్థ 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా'కు అప్పగించింది. ఏఈఈ పోస్టులకు సంబంధిత కేటగిరిలో బీఈ, బీటెక్ ఉత్తర్ణీత సాధించి ఉండాలి. టెక్నికల్ అసిస్టెంట్ల పోస్టులకు ఇంజనీరింగ్ డిప్లొమా పాసైన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కేటగిరి రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు రాత పరీక్ష ద్వారా ఈ పోస్టులు భర్తీ చేస్తారు. రాత పరీక్ష వంద మార్కులకు ఉంటుంది. 80 మార్కులకు సంబంధిత ఇంజనీరింగ్ అంశాలపైన, పది మార్కులకు ఇంగ్లీష్ ప్రావీణ్యం, మరో పది మార్కులకు జనరల్ నాలెడ్జితో కూడిన మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయని దేవదాయ శాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

లోడింగ్‌లో దుమ్మురేపిన విశాఖ పోర్టు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ లోడింగ్‌లో దుమ్మురేపింది. రెండు రోజుల క్రితం నెలకొల్పిన రికార్డును అధిగమించింది. సోమవారం ఒక్క రోజులోనే ఎంవీ ఫెయిత్ నౌకలోకి 8,379 మెట్రిక్ టన్నుల కాల్సిన్డ్ అల్యూమినాను లోడింగ్ చేసింది. ఈనెల 23వ తేదీన 8,055 మెట్రిక్ టన్నుల లోడింగ్ రికార్డును బ్రేక్ చేసింది. ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ స్టీవ్‌డోర్‌గాను, ఈశ్వర్ షిప్పింగ్ సర్వీసెస్ స్టీమర్ ఏజెంట్‌గా వ్యవహరించాయి.

2024లో ఇస్రో ప్రయోగాల పరంపర

జనవరి 1 నుంచే ప్రారంభం.. 2023లో 51 ఉపగ్రహాలు నింగిలోకి

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): కొత్త ఏడాది ఆరంభంతోనే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయోగాల పరంపర ప్రారంభం కానుంది. 2024 జనవరి 1న ఉదయం 7.30 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ58 రాకెట్ ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా 480 కిలోల బరువు కలిగిన ఎక్స్‌పోశాట్ అనే ఖగోళ పరిశోధనా ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. దీంతో పాటు కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన ఒక కేజీ బరువు కలిగిన వియ్‌శాట్ అనే బుల్లి ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించనున్నారు. భూమికి అత్యంత తక్కువ దూరంలోని లియో ఆర్బిట్‌లోకి ఈ రెండు ఉపగ్రహాలను పంపేందుకు అంతా సిద్ధం చేశారు. ఈ ప్రయోగం తరువాత చంద్రయాన్-4, గగన్‌యాన్-1 ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఇవి కాకుండా 2024లో 12 ప్రయోగాలకు తగ్గకుండా చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2023లో ఇస్రో అత్యధికంగా 8 రాకెట్ ప్రయోగాలు చేపట్టి 51 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. పీఎస్ఎల్వీ రాకెట్ల సిరీస్‌లో మూడు రాకెట్ల ద్వారా పది ఉపగ్రహాలు, ఎస్ఎస్ఎల్వీ డీ2 రాకెట్ ద్వారా మూడు ఉపగ్రహాలు, జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్ ద్వారా ఒక ఉపగ్రహం, ఎల్వీఎం 3 సిరీస్‌లో మూడు రాకెట్ ప్రయోగాల ద్వారా 37 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇవి కాకుండా గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి ఆర్ఎల్వీటీడీని ప్రయోగాత్మకంగా నిర్వహించి విజయం సాధించారు. 2023 ఇస్రోకి చరిత్రలో నిలిచిపోయిన సంవత్సరంగా చెప్పవచ్చును. ఎందుకంటే ఈ ఏడాది ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా చంద్రుడి దక్షిణధృవంపై ల్యాండర్, రోవర్‌ను విజయవంతంగా దించి చరిత్రలో మరువలేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. అదే విధంగా సూర్యుడిపై పరిశోధనలకు గాను ఆదిత్య ఎల్1 అనే ఉపగ్రహాన్ని పంపించగా అది విజయవంతంగా పనిచేస్తోంది. ఆదిత్య ఎల్1 ఉపగ్రహం 2024 జనవరి 5న లాంగ్రేజియన్ పాయింట్ 1 వద్దకు చేరుకుంటుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు.



పీఎస్ఎల్వీ సీ58 రాకెట్ ద్వారా ప్రయోగించబోయే ఎక్స్‌పోశాట్ ఉపగ్రహం...



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీఆర్కే కృపాసాగర్, జస్టిస్ సురేష్‌రెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్టోరియా గౌరీ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ హేమలేఖ సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు. అదే విధంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి తిరుచానూరుకు వెళ్లి శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. కాగా, తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారంలో శ్రీవారిని 63,519 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో రూ.5.05 కోట్ల కానుకలు సమర్పించారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



మహ్మద్ రుక్మొద్దీన్ | రాఘవేందర్ | అరవింద్ నాయుడు

మహబూబ్‌నగర్ క్రీడలు: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఈ నెల 30 వరకు జరిగే 37వ త్రోబాల్ జూనియర్ జాతీయస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. మహ్మద్ రుక్మోద్దీన్ (వనపర్తి), రాఘవేందర్ (గద్వాల), అరవింద్‌నాయుడు (చిన్నచింతకుంట) క్రీడాకారులు రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. వీరి ఎంపికపై జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాదత్‌ఖాన్, అహ్మద్ హుస్సేన్, కార్యనిర్వాహక కార్యదర్శి సోహైల్ ఉర్ రహెమాన్, కోశాధికారి రాంమోహన్‌గౌడ్, పీఈటీ శ్రీను హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

భార్యపై ప్రేమతో..

● విగ్రహం ఏర్పాటు చేసిన భర్త



పుష్పమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎంపీ మన్నె

నవాబుపేట: నిండునూరేళ్లు తోడుంటానని ఏడడుగులు వేసిన భార్య మధ్యలోనే కాలం చేసింది. కానీ, తన జ్ఞాపకాలు పదిలం.. తన తోనే జీవితం అంటూ ఒక భర్త తన భార్య విగ్రహం పెట్టించి ప్రేమను చాటుకున్నాడు. మండలంలోని దర్పల్లికి చెందిన ఏదుట్ల రామిరెడ్డి భార్య పుష్పమ్మ గతేడాది అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో భర్త రామిరెడ్డి ఆమె మరణించినా నిత్యం నాతోనే ఉంటుందనే ఉద్దేశంతో ఆమె విగ్రహం పెట్టించాడు. ఆదివారం సొంత వ్యవసాయ పొలం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. భర్తకు భార్యపై ఉన్న ప్రేమ అంతులేనిదని మరణం తర్వాత కూడా నిరూపించిన రామిరెడ్డి ఆదర్శప్రాయుడని ఎంపీ అభిప్రాయపడ్డారు.



భార్య పుష్పమ్మతో రామిరెడ్డి (ఫైల్)

నిత్యం.. రక్తసిక్తం



మక్తల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు (ఫైల్)

- మహబూబ్‌నగర్– రాయిచూర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- అత్యంత ప్రమాదకరంగా బ్లాక్ స్పాట్స్
- ఎక్కడా కన్పించని హెచ్చరిక, సైన్ బోర్డులు
- ఏడాది కాలంలో పదుల సంఖ్యలో మరణాలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలోని 167వ నంబర్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారి మధ్యలో డివైండర్‌తో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్స్, బ్లాక్ స్పాట్స్ సూచించే సైన్‌బోర్డులు లేకపోవడంతో నిత్యం రక్తసిక్తమవుతోంది. మహబూబ్‌నగర్–రాయిచూర్ మధ్య రహదారిపై ప్రమాదాలకు గల కారణాలను పరిశీలిస్తే.. ఎక్కువ మలుపులు ఉండటం, తక్కువ విశాలం, గుంతలు ఏర్పడటంతో పాటు రహదారిపై అవగాహన లేకుండా మితిమీరిన వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలుస్తోంది. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, బస్సులు ఇతర భారీ వాహనాలు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నాయి. కాలినడకన వెళ్తున్న వారు సైతం ప్రమాదాలకు గురికావడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

డివైండర్ లేకపోవడంతో..

సాధారణంగా జాతీయ రహదారులపై డివైండర్ ఉండాలి. కానీ మహబూబ్‌నగర్–రాయిచూర్ 167వ జాతీయ రహదారిపై డివైండర్ లేకపోవడం వాహనదారులకు శాపంగా మారింది. డివైండర్‌తో పాటు మేజర్ బ్లాక్ స్పాట్స్ వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. ప్రధానంగా కోడూర్ చౌరస్తా దాటిన తర్వాత రోడ్డు మలుపు ఉండటంతో పాటు ఓబ్లాయిపల్లి వద్ద ఎత్తు, దిగుడు వల్ల వాహనాల వేగాన్ని నియంత్రించడం కష్టసాధ్యంగా మారుతోంది. ఓబ్లాయిపల్లి వద్ద గతేడాది డిసెంబర్ 9న వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు మృతి చెందారు. తాజాగా మక్తల్ మండలం జక్లేర్ వద్ద రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

మరికల్–మక్తల్ మార్గంలో..

మరికల్–మక్తల్ మార్గంలోని తీలేర్ స్టేజీ సమీపంలో, ఎలిగండ్ల క్రాసింగ్, గుడిగండ్ల మలుపు, జక్లేర్ చౌరస్తా, బొందల కుంట వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, రహదారిపై వాహనదారులకు అవగహన లేకపోవడం వల్ల ప్రమాదాల తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ మార్గంలో బ్లాక్ స్పాట్స్ వద్ద రోడ్డు మలుపు ఉండటం కన్పిస్తోంది. దీంతో అవతలి వాహనం రాకను అంచనా వేయకపోవడంతో పాటు అధిక స్పీడ్ వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు..

167వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్స్‌లలో రేడియం స్టిక్కర్స్‌తో కూడిన స్టాఫర్స్ ఏర్పాటు చేస్తాం. ప్రధానంగా ఏ సమయంలో ప్రమాదాల తీవ్రత ఉంటుందనే విషయంపై సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నాం. జాతీయ రహదారి వెడల్పు కావాల్సి ఉంది. ఆ పనులు పూర్తయితే డివైండర్ ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది.

– టి.మహేష్, డీఎస్పీ, మహబూబ్‌నగర్

ప్రమాదకరంగా మలుపులు..

మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర వరకు రహదారిని పరిశీలిస్తే అధికంగా మలుపులు, ఎత్తుపలాలు కన్పిస్తాయి. మహబూబ్‌నగర్ వన్‌టౌన్ చౌరస్తా నుంచి దేవరకద్ర వరకు 12 డెంజర్ మలుపులు ఉండగా.. 18 చోట్ల ఎగుడు, దిగుడుగా రోడ్డు కన్పిస్తోంది. వన్‌టౌన్ చౌరస్తా నుంచి దేవరకద్రకు 23 కిలోమీటర్ల దూరం ఉంది. అంటే కేవలం 30 నిమిషాల ప్రయాణం. ఈ అరగంట సమయం ప్రయాణికులకు నరకంగా మారుతుంది. మొదటి మలుపు రాజీవ్ గృహకల్ప వద్ద ప్రారంభమవుతుంది. ఇక్కడ ఉండే మలుపు అత్యంత డెంజర్‌గా ఉంటుంది. అక్కడి నుంచి కొంత ముందుకు వెళితే.. మైసమ్మ వద్ద ఉన్న మలుపు వస్తోంది. అక్కడ ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కన్పించవు. అక్కడి నుంచి కొంత ముందుకు వెళ్తే.. ఆల్ మదీనా కళాశాల వద్ద మరో మలుపు దర్శనమిస్తుంది. మరికొంత దూరంలో పెట్రోల్ బంక్ ఎదుట ఉన్న మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. జేపీఎన్సీఈ కళాశాల వద్ద ఉన్న మలుపుతో పాటు కోడూరు, ఓబ్లాయిపల్లి మధ్యలో మరో మలుపు వస్తోంది. ఈ మలుపుల వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అత్యంత డెంజర్‌గా ఉన్న మలుపుల వద్ద కనీసం సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దాదాపు 23 కి.మీ. పొడవునా ఎలాంటి సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేయలేదు.

ఇవీ బ్లాక్ స్పాట్స్..

మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర వైపు వెళ్తున్న అంతర్రాష్ట్ర రహదారిపై నిత్యం ప్రమాదాలు జరిగే స్థలాలు (బ్లాక్ స్పాట్స్) 10 వరకు ఉంటాయి. వాటిలో ముఖ్యమైన ప్రదేశాలు రాజీవ్ గృహకల్ప మలుపు, మైసమ్మ మలుపు, ఆల్ మదీనా కళాశాల, ధర్మాపూర్ క్రాస్‌రోడ్, ధర్మాపూర్ సమీపంలో, చౌదర్‌పల్లి గేట్ ఎదుట, జేపీఎన్సీఈ, కోడూర్, ఓబ్లాయిపల్లి మలుపు, మణ్యంకొండ స్టేజీ, దేవరకద్ర పెద్ద వంతెనపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



బ్లాక్ స్పాట్ ఏరియాను పరిశీలిస్తున్న పోలీస్, రవాణా శాఖ అధికారులు (ఫైల్)

కేంద్ర పథకాలపై అవగాహనే లక్ష్యం



ఉజ్వల యోజనపై ఆరా తీస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రెటరీ రాహుల్ కశ్యప్

● కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి రాహుల్ కశ్యప్

తాడూరు: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా గ్రామాల్లో ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి రాహుల్ కశ్యప్ అన్నారు. భారత్ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం మండలంలోని అంతారం, ఐతోల్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లోని ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రధాని మోదీ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో 17 శాఖలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. సరైన పోషకాహారం, నమ్మకమైన ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య, అవసరమైన సేవలు అర్హులకు అందుబాటులో ఉంచడం లక్ష్యమన్నారు. సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి అర్హులందరికి పథకాలు వర్తించేలా చూడాలని కోరారు. కోట్లాది మంది పౌరుల నిర్లక్ష్య భావనను దూరం చేయడం ఈ యాత్ర లక్ష్యమని తెలిపారు. అర్హులై ఉండి ఇప్పటికీ ప్రయోజనాలు పొందని బలహీనవర్గాలను చేరుకోడానికి సమాచార వ్యాప్తి వంటి విషయాలపై అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు. శిశు సంక్షేమశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, మెప్మా, డీఆర్డీఓ, వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలతో మాట్లాడి వివిధ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, నాబార్డ్ డీడీఎం అఖిల్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వెంకటనారాయణ, ఎల్‌డీఎం కౌశిల్ కిషోర్ పాండే, డీఆర్డీఓ నర్సింగరావు, వికసిత్ భారత్ యాత్ర జిల్లా నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఏపీడీ రాజేశ్వరి, అంతారం సర్పంచ్ విజయమ్మ, ఐతోల్ సర్పంచ్ ఇందుమతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు పీయూ జట్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పీయూ ఖోఖో, చెస్ జట్లు సోమవారం ప్రయాణమయ్యాయి. ఖోఖో పోటీలు కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, చెస్ పోటీలు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో జరగనున్నాయి. ఈ మేరకు విద్యార్థులకు ట్రాక్‌సూట్లను వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య అందజేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, కోచ్ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో చోరీ

చిన్నంబావి: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని దగడపల్లి సీతారామస్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తాళాలను పగులగొట్టి దాదాపు రూ.2.50 లక్షల విలువగల ఆభరణాలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి ఆలయానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. కాగా మండలంలో ఇటీవల చోరీలు అధికమయ్యాయని, పోలీసులు నిఘా పెంచి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలోని సీతారామస్వామి విగ్రహాలు